క్లుప్తంగా

వేడుకగా భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల(శ్రీరామానుజాచార్యుల) ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్న మాడ వీధి ఉత్సవం, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7గంటల వరకు పెద్ద మాడవీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. తిరుమల చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, అధికారులు పాల్గొన్నారు.

గొప్ప తాత్వికవేత్త భగవత్ రామానుజులు


మాట్లాడుతున్న ఆచార్య కె.రాజగోపాలన్

తిరుపతి కల్చరల్: శ్రీవైష్ణవాన్ని, అష్టాక్షరి మంత్రంలోని అర్థాన్ని, సామాన్యులకు మోక్ష మార్గాన్ని ఉపదేశించిన గొప్ప తాత్వికవేత్తగా, సామాజిక సంస్కర్తగా భగవత్ రామానుజాచార్యులు నిలిచిపోయారని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యరులు కె.రాజగోపాలన్ ఉద్ఘాటించారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మూడు రోజులుగా అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న శ్రీరామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆచార్య కె.రాజగోపాలన్ రామానుజాచార్యులు – తిరుమల కైంకర్యాలు అనే అంశంపై ఉపన్యసించారు. రామానుజాచార్యుల మేనమామ తిరుమలనంబి తిరుమల శ్రీవారికి నిత్య కైంకర్యాలు చేశారని, శ్రీఅనంతాళ్వారు పుష్ప కైంకర్యాలు నిర్వహించారని వివరించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజ్యలక్ష్మి బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తులను అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

నగరి.. జీవన ప్రమాణాలు పెరిగి..

- నాడు అభివృద్ధికి దూరం..
- నేడు ప్రజల చెంతనే ప్రభుత్వ సేవలు
- రూపురేఖలు మారిన స్కూళ్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక సేవలు



నాడు నగరి ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు



నేడు నగరి ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు

నగరి: గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి అంటే నగరి ప్రజలకు ఆమడ దూరంలో ఉండేది. నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు ఉన్నా చెప్పుకోదగిన విధంగా ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదు. కనీసం ప్రజలు సేదతీరడానికి పార్కు ఉండేది కాదు. పిల్లలకు ప్రభుత్వ స్కూళ్లలో మంచి విద్య అందేది కాదు. లేదంటే ప్రైవేటు పాఠశాలలకు పంపే పరిస్థితి. ప్రభుత్వ పాఠశాల చదువు అంటే అది పేదవాళ్లకు మాత్రమే అనే దుస్థితి కల్పించారు గత పాలకులు. నగరిలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నా కనీసం సొంత భవనాలు లేవు. ఆస్పత్రుల్లో కనీస వసతులు ఉండేవి కాదు. చిన్నపాటి జబ్బు వచ్చినా తిరుపతికి రెఫర్ చేసేవారు. డయాలసిస్ చేసుకోవాలంటే చెన్నై, శ్రీకాళహస్తి, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లాలి. గ్రామీణ ప్రజలు చిన్నపాటి వైద్యానికి కూడా పట్టణాలకు పరుగుతు పెట్టేవారు. ఆస్పత్రి ఉన్నా వెళ్లడానికి దారి సక్రమంగా ఉండేది కాదు. రైతులు భూసార, విత్తన పరీక్షలు చేసుకోవాలన్నా తిరుపతికి వెళ్లాల్సిందే. పేదల వివాహాలకు కల్యాణ మండపాలు ఉండేవి కాదు. చివరకు చనిపోయి శ్మశానానికి వెళ్లాలంటే బతికున్నవారు భయపడేవారు. ఇలా ప్రతి రంగం నిర్వీర్యమైంది.

ఈ ప్రభుత్వం వచ్చాక మారిన నగరి..

ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి ఐదేళ్లలో మారిపోయింది. నగరి నియోజకవర్గం అభివృద్ధి వైపు ప్రయాణించింది. ప్రభుత్వ స్కూళ్లు, వైద్యశాలలు కార్పొరేట్ స్థాయికి దీటుగా మారాయి. ఆస్పత్రులకు రోడ్డు సౌకర్యం వచ్చింది. నియోజకవర్గ ప్రమాణాలు పెరిగాయి. రెవెన్యూ డివిజన్ అయింది. మున్సిపాలిటీల్లో పార్కులు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ సేవలు అందించే సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు కొలువుదీరాయి. టీటీడీ కల్యాణ మండపాలు, షాదీమహల్, కమ్యూనిటీ హాల్లు పేదల కోసం ఏర్పాటయ్యాయి. ఆలయాలకు మహర్దశ వచ్చింది. శ్మశానాలు ఆధునీకరించబడి బర్నింగ్ షెడ్ కూడా వచ్చింది. అభివృద్ధితో పాటు సంక్షేమం ప్రతి తలుపు తట్టింది. దీంతో ప్రజలు తమకు అండగా నిలిచిన ప్రభుత్వానికే అండగా నిలుస్తామని చెబుతున్నారు.



నగరి టవర్ క్లాక్

బతుకు మారింది..



2014 నుంచి మా జీవితంలో కష్టాలే. ప్రభుత్వం నుంచి ఒక్క మేలు కూడా జరగలేదు. 2019 నవంబరు నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మా కుటుంబం పెద్దదిక్కు కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. మా కుటుంబం ఈ విషాదాన్ని తట్టుకోలేకపోయింది. ఈ దశలోనే మాకు ప్రస్తుత ప్రభుత్వ సహకారం మొదలైంది. వైఎస్సార్ ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చింది. వాహనమిత్ర పథకంలో నా కుమారుడు సుధాకర్‌కు రూ.10 వేలు అందింది. నాకు పెన్షన్ రూ.3 వేలు వస్తోంది. రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.13500, చేయూత పథకం ద్వారా రూ.18750 వస్తుండడంతో పొలంలో పంట సాగు చేపట్టాం. మా ఊరిలోనే ఉన్న రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు, ఎరువులు దొరుకుతున్నాయి. నా కోడలు రాములమ్మ పేరిట ఉన్న డ్వాక్రా రుణం రూ.72 వేలు వైఎస్సార్ ఆసరా కింద మాఫీ అయింది. రూ.1.64 కోట్ల వ్యయంతో మా ఊరి బడి, ఆస్పత్రిని బాగు చేశారు. నా మనవడు మహేష్ మా ఊరి స్కూల్‌కే వెళ్తాడు. అమ్మఒడి కింద రూ.15 వేలు వస్తోంది. గత ప్రభుత్వంలో కోలుకోలేని మా కుటుంబానికి ప్రస్తుతం ప్రభుత్వమే పెద్దదిక్కయింది. ఇంతగా మాకు మేలు చేసిన ప్రభుత్వం వైపే నిలబడతాం.

–కుటుంబ సభ్యులతో నేసమణి,ముడిపల్లి, నగరి మండలం


నేడు దేశమ్మదేవాలయం


నాడు దేశమ్మ దేవాలయం


పుత్తూరులోని బర్నింగ్ షెడ్

జీడీనెల్లూరు.. అభివృద్ధికి మారుపేరు

- ప్రజల చెంతకే చేరిన ప్రస్తుత ప్రభుత్వ పాలన
- గ్రామాల్లోనే 504 రకాల సేవలు
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన
- మంచి చేసిన వారికే మా ఓటు అంటున్న ప్రజలు
- విద్య, వైద్యం అందించిన పాలకులను ఎన్నుకుంటామని స్పష్టం



అన్ని సౌకర్యాలతో రూపుదిద్దుకున్న కార్వేటినగరం మండలంలోని కత్తెరపల్లి ప్రభుత్వ పాఠశాల


కరోనా సమయంలో వలంటీర్ల సేవలు

కార్వేటినగరం: ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలందరికీ అండగా నిలిచింది. దేశంలోనే మొట్టమొదటగా కరోనా వ్యాక్సిన్ తీసుకొచ్చి ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రభుత్వానికి అండగా నిలవాలని ఓటర్లు ఆలోచిస్తున్నారు. గత ప్రభుత్వాల కంటే ప్రస్తుత ప్రభుత్వమే తమకు అన్ని విధాలా అండగా నిలిచిందని చెబుతున్నారు. గత ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఏదైనా పని కావాలంటే సుదూరంలో ఉన్న మండల, జిల్లాకేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. కానీ ఇప్పుడు పల్లెల్లోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ప్రజలకు అవసరమయ్యే ప్రతి ధ్రువీకరణ పత్రం కూడా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే లభిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోనే లోకల్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేసి మహాత్ముడి కలలను నిజం చేసింది. ప్రజలకు వారి ఇళ్ల వద్దే సేవలు అందించేలా చేసింది. ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లు, తాగునీటి సదుపాయం ఇలా ప్రతి అభివృద్ధి పని ప్రజల కళ్లకు కనిపించేలా చేసింది ప్రస్తుత ప్రభుత్వం. తమకు అండగా నిలిచిన వారికే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారు. ఇన్నేళ్లు ప్రజల గురించి ఆలోచించని కొందరు నేతలు ఇప్పుడు అబద్ధపు హామీలతో వస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాంటి అవకాశవాదులకు అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సుముఖత చూపడం లేదు.

మంచిన చేసిన వారికి మా ఓటు



'కరోనా మహమ్మారి ప్రాణాలను హరిస్తున్న సమయంలో ప్రాణాలను ఒడ్డి మాకు సేవలు అందించిన ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకుంటాం. ఆ ప్రభుత్వం ఉంటేనే మేము బాగుంటాం. లాక్‌డౌన్ సమయంలో ఇంటికే పరిమితమైన ప్రజలకు నిత్యావసర సరుకులు, వైద్యసేవలు అందించి మాకు అండగా నిలిచింది. సంక్షేమాన్ని అందించిన పాలకులకే ఓటేస్తాం.

– పద్మనాభశెట్టి, సురేంద్రనగరం, కార్వేటినగరం

విద్యకు ప్రాణం పోశారు..



రానున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్ల దీటుగా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. గతంలో ఎవరూ ఇలా చేయలేదు. మా పిల్లలకు ప్రభుత్వ బడిలో సాంకేతిక విద్యాబోధన అందిస్తున్న ప్రభుత్వం వస్తే మేలు. వారికే మేము అండగా నిలబడతాం.

–రుక్మాంగధరెడ్డి, అమ్మపల్లి, కార్వేటినగరం మండలం




జీడీనెల్లూరు: చిన్నవేపంజేరి గ్రామ రైతు భరోసా కేంద్రం, వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామానికి వెళ్లే రోడ్డు



పెనుమూరు తాటిమాకుల పల్లి సచివాలయం



పెనుమూరు సచివాలయం


ఆధునీకరణ చేసిన ఆలత్తూరు వరద వేంకటేశ్వర స్వామి ఆలయం

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు

కార్వేటినగరం: ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందించాలన్న సంకల్పంతో ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తోంది. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయి. గత పాలనలో నెలల తరబడి కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా అందని సేవలు ఇప్పుడు గంటల్లో అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం..

సచివాలయాల్లో జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లను ప్రజలు సులభంగా పొందుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లయ్, హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, హౌసింగ్ ఆధార్ సేవల కోసం దరఖాస్తులు చేసుకుంటే నిర్దేశించిన సమయానికి ధ్రువపత్రాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన ప్రయాస తప్పిపోయింది. ఊరిలోనే, ఇంటికే వలంటీర్లు వచ్చి పథకాలకు అర్హత ఏంటి ? ఏ పథకం వర్తిస్తుంది ? తదితర విషయాలను వివరించి వారే ప్రజల చేత దరఖాస్తు చేయిస్తున్నారు.


గంగాధరనెల్లూరు: చిన్నవేపంజేరి సచివాలయం

నియోజకవర్గంలో సేవలు	
గ్రామ సచివాలయాల సంఖ్య-	88
సచివాలయల సిబ్బంది సంఖ్య-	674
వలంటీర్ల సంఖ్య-	1333
సేవల సంఖ్య-	504
గ్రామ సచివాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం వెచ్చించిన మొత్తం –	రూ.25.15 లక్షలు

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయండి


శ్రీకావేరిరాజుపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ భారతి

పాలసముద్రం: ఎన్నికల వేళ ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ భారతి తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురం, ఆముదాల, వనదుర్గాపురం, వెంగళరాజుకుప్పం, పాలసముద్రంలో ఎన్నికలు జరుగునున్న కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌ఐ భారతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుందని, ప్రజలంతా ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ఎవరూ ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఓటును అమ్ముకోకుండా సరైన నాయకున్ని ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మురుగేష్, చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడే పోలింగ్

- ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు
- విధుల్లో భాగంగా పోలింగ్ బూత్‌లకు చేరుకున్న సిబ్బంది
- ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన అబ్జర్వర్ కైలాస్ వాంగ్డే


ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సలహాలు ఇస్తున్న జీడీనెల్లూరు ఆర్‌ఓ వెంకటశివ

నగరి: సార్వత్రి ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగే పోలింగ్ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పకడ్బందీగా చేపట్టారు. నగరి మున్సిపల్ పరిధిలోని కేవీకే మైదానంలో ఏర్పాటుచేసిన ఎన్నికల నిర్వహణా శిబిరంలో ఎన్నికల అధికారి వెంకట రెడ్డి సిబ్బందికి సూచనలు అందించారు. వారికి విధులు కేటాయించడంతో ఆయా బూత్‌లకు సిబ్బంది చేరుకున్నారు. నియోజకవర్గంలో 2,02574 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుష ఓటర్లు 98537, మహిళా ఓటర్లు 104029, ట్రాన్స్‌జెండర్లు 8 మంది ఉన్నారు. వీరికి పోలింగ్‌కు గాను 185 లొకేషన్లలో 231 బూత్‌లు ఏర్పాటుచేశారు. పంపిణీ కేంద్రంగా కేవీకే మైదానం, స్ట్రాంగ్ రూమ్‌గా ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టు హాలు, ఏపీఎల్‌ఏగా జిమ్ రూము, టేబుల్ టెన్నిస్ రూము కేటాయించారు. 1053 మంది సిబ్బంది ఎన్నికల విధులకు హాజరవుతుండగా, పోలింగ్ ఆఫీసర్లుగా 149 మంది, ఏపీఓలుగా 169, ఓపీవోలుగా 673 మంది, మైక్రో అబ్జర్వర్లుగా 62 మంది, సెక్రటోరియల్ ఆఫీసర్లుగా 31 మంది వ్యవహరించనున్నారు.

ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన అబ్జర్వర్..

కేవీకే మైదానంలోని పంపిణీ కేంద్రాన్ని అబ్జర్వర్ కైలాస్ వాంగ్డే ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఆరాతీశారు. ఎన్నికలు సజావుగా జరగాలని సిబ్బందికి సూచించారు.

నిర్భయంగా ఓటు వేయండి

కార్వేటినగరం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి వెంకటశివ అన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వెబ్ కెమెరా సౌకర్యాలతో 256 పోలింగ్ స్టేషన్లు, 22 పోలింగ్ లొకేషన్లతో పాటు 132 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా లోపల, బయట వెబ్ కెమెరాలతో 5 గురు పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 6 మండలాల్లో ప్రతి మండలానికి 1 ఎస్‌ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దళం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎక్కడా ఎలాంటి సమస్యలు, అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా 5 నుంచి 10 నిమిషాల్లో భద్రతా సిబ్బంది మోహరించేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంప్రదించడానికి ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 7337027151 రిటర్నింగ్ అధికారి నంబర్‌ను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అలాగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఎస్‌ఐ, బీఎల్‌ఓ, సెక్టార్ అధికారి నంబర్లను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నింద్ర: మండలంలో సోమవారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. మండల కేంద్రంలో ఆమె పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మొత్తం 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 150 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారని తెలిపారు. ప్రజలంతా ఓటింగ్‌కు సహకరించాలని కోరారు.


నగరి: సిబ్బందికి సామగ్రి అందిస్తున్న అధికారులు


ఎన్నికల విధులు కేటాయిస్తున్న ఆర్‌ఓ వెంకటరెడ్డి